
# సత్యవాక్యం

# THE WORD OF TRUTH



క్రైస్తవ మాసపత్రిక

JANUARY - 2005

ఆత్మీయ ప్రేక్షకులకు సమర్పించుచున్నది




TEJA TV

MAA TV

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు

**మా టి.వి.**లోను

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు

**తేజ ఛానల్** లోను చూడండి.

ప్రతి గురువారం : **SITI కేబుల్ & IN కేబుల్లో**

(కాకినాడలో మాత్రమే) ఉదయం 7:00 గంటలకు,

సాయంత్రం 5:30 గంటలకు

ప్రసంగీకులు : Bro. **జాషువా గూటం**

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు వివరించండి !!!

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 25 | జనవరి 2005 | సంచిక 6


## బాప్తిస్మము

*(Baptism)*

పాపము నుండి మానవుడు విడుదల పొందవలెనంటే యేసు నందు విశ్వాసముంచి, మారుమనస్సు పొంది, యేసును మనుష్యుల యెదుట ఒప్పుకొని, బాప్తిస్మము పొందవలెనని క్రొత్తనిబంధన బోధించుచున్నది. ఆకాశము క్రింద మనుష్యులలో ఈయ బడిన మరి యేమతము నందును రక్షణ లేదు, యేసు నామముననే రక్షణ యున్నది అని కూడా బైబిలు బోధించుచున్నది (అపొ.కా. 4:12). గత కొద్ది పాఠములలో విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలును గూర్చి మనము కొంత తెలిసికొని యున్నాము. నీవు ఆ యాజ్ఞలకు లోబడిన యెడల రక్షణ మార్గములో ప్రవేశించావు. అయితే రక్షింపబడుటకు నీవు చేయ వలసినది ఇంకొక్కటి మాత్రమే యున్నది - బాప్తిస్మమును పొందవలెను.

నీవు బాప్తిస్మము పొందవలెనని

యేసు ఆజ్ఞాపించు చున్నారు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనివానికి శిక్ష విధింపబడును" అని ఆయన హెచ్చరించుచున్నారు (మార్కు 16:16). "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని అపొ.కా. 2:38లో పేతురు ఆజ్ఞాపించుచున్నాడు. "గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసిన బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసి కొనుము" అని అపొ.కా. 22:16 ఆజ్ఞాపించు చున్నది. "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" యని 1 పేతురు 3:21 చెప్పుచున్నది. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" యని రోమా 6:3లో పౌలు ప్రశ్నించు చున్నాడు. గలతీ 3:27లో "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" అని అతడు వ్రాసెను.

ఇంతవరకు మనము చూచిన అనేకమైన వాక్యములను బట్టి మనకు ఏమి అర్థమగుచున్నది? రక్షణ పొందుటకు, పాపక్షమాపణ నిమిత్తము, పాపములను కడుగుకొనుటకు, క్రీస్తులోనికి ప్రవేశించుటకు, ఆయన సంఘమందు చేర్చబడుటకు బాప్తిస్మము పొందవలెనని అర్థమగుచున్నది. బాప్తిస్మము యొక్క ప్రయోజనమును దేవుని వాక్యము ఇంత విపులముగా చెప్పుచుండగా, రక్షణ పొందుటకు బాప్తిస్మము అవుసరము లేదు అని అనేకులు బోధించుట వింతగానే యున్నది. ఉదాహరణ కొరకు మనము మార్కు 16:16లో యేసు చెప్పిన దానిని ఆలోచించుదాం : "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును" అని ఆయన చెప్పెను. రక్షణను ఒకడు ఎప్పుడు పొందవచ్చును? నమ్మి బాప్తిస్మము పొందిన తరువాతనే గదా! యేసు యిచ్చిన ఈ ఆజ్ఞలో రక్షణ పొందుటకు నమ్ముట ఎంత అవుసరమో బాప్తిస్మము పొందుట కూడ అంత అవుసరమని బోధించెను. అయితే కొందరు నీవు నమ్మగానే రక్షణ పొందితివి గనుక తరువాత బాప్తిస్మము పొందవచ్చును అని వారి స్వసిద్ధాంతములను బోధింతురు. మానవ ఆజ్ఞలకు నీవు లోబడుటకంటే దేవుని ఆజ్ఞలకు విధేయత చూపుట మంచిది.

అపొ.కా. 2:38లో "మీరు మారుమనస్సు పొంది మీలో ప్రతివాడును

పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుడి" యని పరిశుద్ధాత్ముడు పేతురు ద్వారా పలికెను. పాపక్షమాపణ కొరకు లేదా రక్షణ పొందుటకు ఇక్కడ మారుమనస్సు, బాప్తిస్మము ఆజ్ఞాపింపబడెను. యేసు నందు విశ్వాసముంచిన ప్రజలకు ఈ ఆజ్ఞ ఇయ్యబడెను. పెంతెకోస్తు పండుగ దినమున యెరుషలేములో మొట్టమొదటి సువార్త ప్రసంగమును పేతురు చేసెను. యేసే క్రీస్తు అని అక్కడ గుమిగూడిన వేలకొలది ప్రజలకు అతడు నిరూపించెను. మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెను అని అతడు వారికి బోధించెను. వారు ఈ మాట విని హృదయములో పొడువబడి సహోదరులారా, మేమేమి చేయవలెనని అడిగిరి. వారు హృదయములో పొడువబడిరి అనగా వారు విశ్వసించిరి అని ఇట్టే మనము గమనించగలము. విశ్వసించిన వీరు రక్షణ పొందుటకు మేమేమి చేయవలెనని పేతురును, మిగిలిన అపొస్తలులను అడుగగా "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుడి" యని ఆజ్ఞాపింపబడిరి. గనుక వీరు యేసునందు విశ్వాసముంచిన మాత్రముననే రక్షింపబడలేదు. విశ్వసించిన తరువాత మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము వారు బాప్తిస్మము పొందిరి.

అపొ.కా. 8వ అధ్యాయములో ఐతియొపీయుడైన నపుంసకుడు ఒకడు బాప్తిస్మము పొందక ముందు యేసు క్రీస్తు దేవుని కుమారుడని తాను నమ్ముచున్నట్లు ఒప్పుకొనెను (8:37).

అపొస్తలులు వారి కాజ్ఞాపించబడిన రీతిగా సర్వలోకమునకు సువార్తను ప్రకటించిరి. అనేకులు వారి వాక్యమును విశ్వసించి, బాప్తిస్మమును పొందిరి. మొదటి శతాబ్దములో అపొస్తలులు చేసిన పనిని గూర్చి "అపొస్తలుల కార్యములు" అను పుస్తకము క్రొత్త నిబంధనలో మనకు తెలియజేయు చున్నది.

అయితే ఈరోజు రక్షణ పొందుటకు బాప్తిస్మము అవుసరము అని మనము నేర్చుకొన్నాము. బాప్తిస్మము పొందకుండగనే రక్షింపబడినవారిని గూర్చి క్రొత్త నిబంధన ఎక్కడ బోధించుట లేదు. గనుక బాప్తిస్మము పొందకుండా రక్షింపబడితినని నీ వనుకొనవద్దు.

రోమా 6:3-5 వరకు మనము చదివిన ఇట్లు కన్పడుచున్నది. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?

కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో ఆలాగే మనమును నూతన జీవము పొందిన వారమై నడుచుకొనునట్లు మనము బాప్తి స్మము వలన మరణములో పాలు పొందు ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యము గల వారమైన యెడల, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యము గలవారమై యుందుము". దీనిని బట్టి నూతన జీవితము బాప్తిస్మము తరువాతనే ఆరంభమగును గాని దానికి ముందు కాదు. ఏలయనగా బాప్తిస్మము లోనే ప్రభువు మన పాపములను కడిగి వేయును. "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింధి 5:17). అయితే నీవు క్రీస్తులోనికి ఎట్లు ప్రవేశించగలవు? క్రీస్తులోనికి బాప్తి స్మము పొందుట ద్వారా ప్రవేశించగలవు. అంతేకాదు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన వారు క్రీస్తును ధరించుకొని యున్నారు అని పౌలు చెప్పుచున్నాడు. బాప్తిస్మము పొందకుండా క్రీస్తును ఎవరును ధరించు కొనలేరు. రక్షణ క్రీస్తులోనే యున్నది. బాప్తిస్మము ద్వారా మనము క్రీస్తులోనికి రాగలము. గనుక బాప్తిస్మము పొందుట ద్వారా రక్షణలోనికి ప్రవేశించగలము గాని దానికి ముందుకాదు. క్రీస్తును ధరించు కొనిన వాడే క్రైస్తవుడు. బాప్తిస్మము పొందుట ద్వారా ఒకడు క్రీస్తును ధరించు కొనును. గనుక బాప్తిస్మము పొందినవాడే క్రైస్తవుడు గాని దానిని పొందనివాడు కాదు.

బాప్తిస్మమును, మారుమనస్సు పొందిన విశ్వాసులు పొందవలెను. వేరొక మాటలో బాప్తిస్మమును పొందక ముందు ఒకడు యేసునందు విశ్వాసముంచవలెను, తన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను, యేసు దేవుని కుమారుడని ఒప్పుకొనవలెను. ఎవ్వరైతే వీటిని చేయ గలరో, వాటిని చేయ నిశ్చయించు కొనిరో, వారు మాత్రమే బాప్తిస్మము పొందవలెను. నమ్మలేనివారు, మారుమనస్సు పొందలేని వారు, యేసును ఒప్పుకొనలేనివారు బాప్తి స్మము పొందిన యెడల ఏమి ప్రయోజ నము? గనుక పసిబిడ్డలకు బాప్తిస్మమిచ్చిన అది వ్యర్థమే అని మనము గమనించవలెను.

విశ్వాసము ఒక్కటే ఎట్లు రక్షించదో, బాప్తిస్మమొక్కటే అట్లే రక్షించదు. అయితే యేసు ఆజ్ఞాపించిన రీతిగ నీవు ఆయన యందు విశ్వసించి, నీ పాపవిసర్జన చేసి, బాప్తిస్మమును పొందిన యెడల ఆయన

తప్పక నిన్ను రక్షించును. నీవు విశ్వాసి వయిన యెడల నీ విశ్వాసమునకు విధేయత చూపుచు నీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని నిన్ను హెచ్చరించుచున్నాను.

ఉపమానమాలిక

# ఇది ఎట్టిమాట?

*(What a Word is this?)*

యేసు క్రీస్తు సామాన్య బోధకుడు కాదు. ఆయనను బంధించుటకు వెళ్లిన మనుష్యులు ఆ పని చేయలేకపోయారు; ఆయన మాట్లాడినట్లు ఎవడును ఎన్నడును మాటలాడ లేదన్నారు (యోహా 7:46). ఆయన కొండమీద నుండి చేసిన ప్రసంగము వినిన జనసమూహములు ఆయన బోధకు ఆశ్చర్య పడుచుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె గాక అధికారము గలవానివలె వారికి బోధించారు (మత్త 7:28, 29). యేసు శోధింపబడిన తరువాత గలిలయలోని కపెర్న హూములో బోధించుచుండగా అపవిత్రమైన దయ్యము పట్టిన వానిని బాగుచేసారు. "అందుకందరు విస్మయమొంది ఇది ఎట్టిమాట? ఈయన అధికారముతోను బలముతోను అపవిత్రాత్మలను ఆజ్ఞాపింపగానే అవి వదలి పోవుచున్నవని" చెప్పుకొన్నారు (లూకా 4:36). యేసు ప్రభువు యొక్క బోధలను నిష్కల్మష హృదయంతో ఆలకించువారు నేటికిని ఇది ఎట్టి బోధ? యని ఆశ్చర్య పడుచున్నారు.

## దేవుని రాజ్యమాట

యేసు మాట దేవుని రాజ్యపు మాటయై యున్నది. పరలోకమందున్న దేవుడొక రాజ్యము స్థాపించును; అదెన్నటికి నాశనము జెందదని దానియేలు ప్రవచించాడు (దానియేలు 2:44). బాప్తిస్మమిచ్చు యోహాను క్రీస్తు మార్గమును సరాళము చేయుచు మారుమనస్సు పొందుడి; పరలోక రాజ్యము సమీపమై యున్నదని బోధించాడు (మత్త 3:2-3). యేసు కూడ దేవుని రాజ్యమును గూర్చిన సువార్తను ప్రకటించుచు సంచారము చేసాడు (మత్తయి 4:23). క్రీస్తు యొక్క సంఘమే పరలోక రాజ్యము, లేక దేవుని రాజ్యమని మన మెరుగుదుము.

## రక్షణ మాట

యేసు క్రీస్తు యొక్క మాట రక్షణ మాటయై యున్నది. ఆయన తన ప్రజలను వారి పాపములనుండి రక్షించడానికి ఈ లోకానికి వచ్చారు గనుక ఆయనకు యేసు అని పేరు పెట్టబడెను (మత్త 1:21). "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని" చెబుతు ఆయన ఈ లోకానికి ఎందుకు వచ్చిందీ మనకు వివరించారు (లూకా 19:10). ఆయన జీవించారు, బోధించారు, మరణించారు, తిరిగి లేచారు. ఇదంతా "పాపులను రక్షించుటకు" ఆయన చేసారు (1 తిమో 1:15). పునరుత్థానుడైన తరువాత ఆయన అపొస్తలులను సర్వలోకానికి పంపించారు: ఈ లోకంలో యున్న రోగాలను బాగు చేయడానికి గాక, పాపము నుండి ఈలోకమును రక్షించడానికి ఆయన వారిని పంపుచు, "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును: నమ్మని వానికి శిక్ష విధింప బడునని" చెప్పారు (మార్కు 16:15, 16).

యేసు ప్రభువు మాట వినకుండా, నేర్చుకోకుండా యెవడు ఆయన యొద్దకు రానేరడని ఆయన తెలియజేసారు (యోహా 6:44, 45). నమ్మ్ము ప్రతివానిని రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నదని అపొస్తలులు బోధించారు (రోమా 1:16). సువార్త ద్వారా క్రీస్తు ప్రజలను పిలుచు చున్నారు, సువార్త ద్వారా ఆయన వారిని రక్షించు చున్నారు (2 థెస్స 2:14). అందువలన "మీ ఆత్మలను రక్షించుటకు శక్తి గల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" యని మనకు చెప్పబడినది (యాకో 1:21). క్రీస్తు వాక్యము రక్షణ వాక్యము.

## సమాధాన వాక్యము

క్రీస్తు వాక్యము సమాధాన వాక్యమై యున్నది. "మన మందరము గొర్రెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తన కిష్టమైన త్రోవకు తొలిగెను". "రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచ కాలేదు. విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను గనుక ఆయన ఆలకింప కున్నాడు" అని యెషయా మన పరిస్థితిని సరిగనే వర్ణించాడు (యెష 53:6; 59:1,2). క్రీస్తు లేకుండ మనందరి పరిస్థితి నిజానికి అట్లున్నది: "ఏలయనగా అందరును పాపము చేసి దేవుడను

గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3:23). పాపముల వలన మనందరం దేవుని నుండి వేరుచేయబడినను, శుభవార్త యేమంటే క్రీస్తు వాక్యము వలన మనం దేవుని యొద్దకు వచ్చి ఆయనతో తిరిగి చేర్చబడగలము, సమాధాన పడగలము.

యేసు క్రీస్తు తన సిలువ వలన మానవుని, దేవుని సమాధాన పరచవలెనని మరణించినట్లు అపొ.పౌలు చెప్పాడు (ఎఫెసీ 2:16). "ఆయన ద్వారానే మనము ఉభయులము ఒక్క ఆత్మయందు తండ్రి సన్నిధికి చేర గలిగి యున్నాము" (18వ వచనం). పాపముల వలన మనం దేవునికి శత్రువుల మయ్యాము. ఏలయనగా శత్రువులమై యుండగా, ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధాన పరచబడి రక్షింపబడుదుము అని రోమా 5:10లో వ్రాయబడి యున్నది.

మానవుని తిరిగి దేవుని యొద్దకు చేర్చుటకే యేసు ప్రభువు ఈ లోకానికి వచ్చారు. ఆయన వాక్యము అందుకే సమాధాన వాక్యమయ్యింది. "ఆయన సిలువ రక్తము చేత సంధి చేసి ఆయన ద్వారా సమస్తమును, అవి భూలోకమందున్నవైనను, పరలోకమందున్నవైనను వాటినన్నిటిని ఆయన ద్వారా తనతో సమాధాన పరచు కొనవలెననియు తండ్రి అభీష్టమాయెను. మరియు గత కాలమందు దేవునికి దూరస్థులును, మీ దుష్ క్రియల వలన మీ మనస్సులో విరోధభావము గలవారునై యుండిన మిమ్మును కూడ తన సన్నిధిని పరిశుద్ధులుగాను నిర్దోషులుగాను నిరపరాధులుగాను నిలువ బెట్టుటకు ఆయన మాంస యుక్తమైన దేహమందు మరణము వలన ఇప్పుడు మిమ్మును సమాధానపరచెను" అని అపొ.పౌలు కొలస్స 1:19-22లో చెప్పుచున్నాడు. క్రీస్తు సువార్త సమాధాన సువార్తయై యున్నది.

## నీతి వాక్యము

క్రీస్తు వాక్యము నీతి వాక్యమై యున్నది. ఆయన వాక్యము నవలంబించకుండగనే క్రైస్తవుల మని చెప్పుకొనువారు శిశువులనబడ్డారు. వారు నీతి వాక్య విషయములో అనుభవము లేనివారై యున్నారు (హెబ్రీ 5:13). దేవుడు మానవుని కిచ్చు పిలుపు ఎల్లప్పుడు నీతి పిలుపై యున్నది. హేబెలు నీతిమంతుడు గనుక అతనిని దేవుడంగీకరించాడు (హెబ్రీ 11:4). నోవహు కూడ అట్లే. దేవుడు తన వాక్యములో ఆయన నీతి మనకు బయలు పరచాడు (రోమా 1:16, 17).

మానవుని నీతి క్రియలన్నియు మురికి గుడ్డలవలె యున్నవని యెషయా ప్రవక్త చెప్పాడు (యెష 64:6). అయితే క్రీస్తు సువార్తలో బయలుపరచబడిన నీతి

అట్టిదికాదు. మానవుని నీతి గాక దేవుని నీతి ప్రయోజనకరమైనది. మనలను పాపము నుండి కడుగడానికి క్రీస్తు సిలువలో తన రక్తాన్ని చిందించారు. "కావున......దేవునితో సమాధాన పడుడని మిమ్మును బతిమాలు కొనుచున్నాము" (2. కొరి 5:20). అబ్రహాము, నోవహు మొదలైనవారు దేవుని నమ్మిరి. అది వారికి నీతిగా ఎంచబడెను (రోమా 4:3). నీవు యేసు క్రీస్తును నమ్మి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందిన యెడల అది నీకు నీతిగా ఎంచబడును. క్రీస్తు వాక్యము ఈనాడు నిన్ను రక్షించగల వాక్యము.

✍ - జాషువా గూటం

# లోతు భార్య

*(Lot's Wife - A warning against Disobedience)*

సొదొమ గొమొఱ్ఱాలు పాపముతో నిండిపోయి దైవోగ్రతకు పాల్పడినందున దేవుడు ఆ ప్రదేశములను నాశనము చేయ తలంచెను. వాటిని నాశనము చేయక మునుపు ఆ ప్రాంతములో నివసించుచున్న నీతిమంతుడైన లోతును, తన కుటుంబమును రక్షించ నుద్దేశించి తన భార్యను, యిద్దరు కుమార్తెలను తీసికొని సురక్షిత ప్రాంతమునకు వెళ్ళుమని దేవుడు లోతుకు చెప్పెను (ఆది.కా. 19:17). నీ ప్రాణమును దక్కించుకొననట్లు పారి పొమ్ము, నీ వెనుక చూడకుము. ఈ మైదానములో ఎక్కడను నిలువక నీవు నశించి పోకుండ ఆ పర్వతమునకు పారిపొమ్మని చెప్పెను. కాని లోతు భార్య అతని వెనుకనుండి తిరిగి చూచి ఉప్పుస్తంభమాయెను (ఆది 19:26).

బైబిలు గ్రంధమందలి ఈ భాగమును గూర్చి అనేకులు అనేక అభిప్రాయములను కలిగియున్నారు. ప్రభువైన యేసు ఒకసారి తన శిష్యులతో మాట్లాడుచు లోతు భార్యను జ్ఞాపకము చేసికొనుడి అని చెప్పెను (లూకా 17:32). ఆమె చేసిన పాపము అవిధేయత. దేవుడు విధేయతను కోరుచున్నాడు. ఎందుకు మనల నుండి దేవుడు విధేయతను కోరుచున్నాడు? మనము దేవుని పోలికగా నిర్మించబడిన వారము. మంచి, చెడుల తారతమ్యమును గ్రహించి మంచిని మాత్రమే ఎంచుకొనే వివేచన మనలో యుంది. మనము సుఖముగ జీవించు నిమిత్తము దేవుడిచ్చిన ఆజ్ఞలకు కట్టడలకు మనము విధేయత చూపించవలెనని ఆయన మనకు ఆజ్ఞాపించు చున్నాడు.

దేవుని ఆజ్ఞలకు లోబడి జీవింపని వ్యక్తి తన జీవితములో ఎన్నో దుఃఖములు, బాధలు, చివరకు ఆత్మీయ మరణము పొందును. ఇది ఎంత భయంకరము గదా. దేవుడిచ్చిన ఆజ్ఞలకు మనము లోబడుట ద్వారా ఈ లోకములోను, పరలోకమందును ఎంతో నెమ్మది, సంతోషము వ్యక్తిగతంగా అనుభవించుట మాత్రమే గాక, సాంఘికముగ కూడ పొందగలము. అందుకే దేవుడట్టి విధేయతను మననుండి కోరుచున్నాడు.

## విధేయత ఎందుకు?

పరలోకములో యుండి ఆయనను సేవించుట కొరకు మనము దేవుని యెడల విధేయత కలిగి యుండాలి (ప్రక 7:15, 22:14). దేవునికి మనము విధేయత కలిగి యుండనట్లయితే మనము సాతానును సేవించు చున్నామన్న మాట (రోమ 6:16-18). మనము విధేయత కలిగి యుండుటను నేర్చుకొనవలెను. క్రీస్తు కూడ విధేయత కలిగి యుండుటను నేర్చుకొనెను (హెబ్రీ 5:8). ఆయన కుమారుడై యుండియు తాను పొందిన శ్రమల వలన విధేయత నేర్చుకొనెను. మానవుడు విధేయతను నేర్చుకొనుటకు దేవుడు కొన్ని పద్ధతులుపయోగించెను. ఎవరైతే దేవునికి విధేయులై జీవించుచున్నారో వారికి ఆయనతో బాటు నిత్యజీవము, అవిధేయులైన వారికి నిత్యనరకము యేర్పాటు చేసెను. పరలోకమందలి దూతలు అవిధేయత చూపినపుడు కూడ దేవుడు ఊరకుండ లేదు. దేవదూతలు పాపము చేసినపుడు దేవుడు వారిని విడిచి పెట్టక, పాతాళలోకమందలి కటిక చీకటి గల బిలములలోనికి త్రోసి, తీర్పుకు కావలిలో యుండుటకు వారిని అప్పగించెను (2 పేతు 2:4-6). నోవహు కాలమందలి అవిధేయులైన వారిని, సొదొమ గొమొఱ్ఱాలు పట్టణస్థులను నాశనము చేసి నీతిమంతుడైన లోతును రక్షించిన విధము ఇవి యన్నియు దేవునికి అవిధేయులైన వారికి కలిగిన ప్రతిఫలము. దేవుడు ఎందుకు నైతిక జీవితమును కోరుచున్నాడు? పాపము దుఃఖమునకు కారణము. మానవుడు వ్యక్తిగతముగాను, సాంఘికముగను జీవించే వ్యక్తి గనుక నైతిక వర్తనలేని యేవ్యక్తి కూడ వ్యక్తిగతంగాను సాంఘికంగాను సుఖముగ, సంతోషముగ, నెమ్మదిగ బ్రతుకలేడు. మనము సుఖముగ, సంతోషముగ, నెమ్మదిగ జీవించాలనెడి కోరిక దేవునికి గలదు. ఈ విధముగ జీవించాలంటే మనకు నైతిక వర్తనము అవసరము, అట్టి నైతిక జీవితము జీవించా లంటే దేవుడిచ్చిన కట్టడలను, ఆజ్ఞలను గైకొనుచు అనగా వాటికి లోబడి యుంటూ దేవునికి అనుకూలముగ జీవించగలము. ఈ సంగతులు దృష్టాంతరములుగ వారికి సంభవించి, యుగాంత

మందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను (1 కొరింథీ 10:11). పై విషయములను బట్టి మనము దేవుడిచ్చిన ఆజ్ఞలకు లోబడి యుండుట మన క్షేమము కొరకే యని గ్రహించగలము.

**మతసంబంధమైన కొన్ని తప్పిదములు :**

1. కయీను, హెబెలులకు జంతు బలిని అర్పించుమని దేవుడు చెప్పెను. కాని దేవుడిచ్చిన ఆజ్ఞను కయీను ధిక్కరించి పొలములో పండిన పంటను తెచ్చి అవిధేయుడాయెను. నియమింపబడిన దానిని గాక వేరొక దానిని బలి అర్పించుట ద్వారా పాపము చేసినవాడాయెను.

2. మోషే ధర్మశాస్త్రమును బట్టి విశ్రాంతి దినమును ఆచరించకపోవుట పాపము (సంఖ్యా 15:33-36). అది ఆనాటి మత సంబంధమైన పాపము.

3. దేవుని మాటలుగాక వేరే కలుపుట వలన కలుగు పాపము (2యోహా : 9-11)

4. దేవుని ఆజ్ఞలను గైకొనక వాటిలో కొన్నింటిని విడిచిపెట్టుట పాపము (ప్ర 22:18-19). కాబట్టి మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయని వానికి పాపము కలుగును (యాకోబు 4:17).

5. దేవుని ఆజ్ఞలు పూర్తిగా కాక, కొంత మట్టుకు మాత్రమే గైకొనుట పాపము. అమాలేకీయులను వారి రాజుతో సహా పూర్తిగా నాశనము చేయుమని సౌలుకు ఆజ్ఞాపించినపుడు సౌలు ఆలాగు చేయక కొన్ని క్రొవ్విన ఎడ్లలో శ్రేష్ఠమైన వాటినుంచి దేవునికి బలి అర్పించెను. దేవుడు ఆ బలిని నిరాకరించెను (1సమూ 15:1-24).

**అవిధేయతకు కొన్ని కారణాలు**

దేవుని ఆజ్ఞలు తెలిసికొనకపోవుట, తిరుగుబాటు చేయు స్వభావము, ఈ లోక సంబంధమైన కోరికలు, ఆత్మీయానుభవములేని నాయకులను అనుసరించుట ద్వారా, గ్రహించలేని మనస్సు, నైతిక జీవితము జీవించుటకు భయపడేవారు. దేవుని ఆజ్ఞలను ఎరిగియుండియు వాటిని గైకొనుటకు 'రేపు' అని వాయిదా వేసేవారు.

లోతు భార్యయొక్క మనస్సు యింకా సొదొమ వైపే యుండుటచే లోకాశకు లోనై దేవుని మాటకు విధేయత చూపక వెనుకకు చూచి నిత్యజీవమును, నిత్యానందమును పోగొట్టు కొనినది. విధేయతను దేవుడు ఎంతగనో కోరుచున్నాడు.

**- లోటీ బెత్ హాట్స్**

# వేషధారుని నిరీక్షణ

*(The Hypocrite's Hope)*

వేషధారుని గూర్చి యోబు 27:8లో యిట్లున్నది : "దేవుడు వాని కొట్టివేయునప్పుడు వాని ప్రాణము తీసివేయునప్పుడు భక్తిహీనునికి ఆధారమేది?" ఈ వచనం భక్తిహీనతను గూర్చి చెప్పుచున్నది. వేషధారణ లేక భక్తిహీనత యేమిటి? భక్తిహీనతకు హెబ్రీ భాషలో, "దైవ దూషణ కరమైన లేక దేవుడులేని" యను భావము కలదు; గ్రీకు భాషలో ఒకనాటికలో నటించుట యను భావము కలదు. ఒకటి చెప్పి ఇంకొకటి చేయువానిని మనం వేషధారుడనవచ్చును. అతడు కాని దానిని ఉన్నట్లు నటిస్తాడు.

వేషధారులు ఏమిచేస్తారు? బైబిలు ఏమి చెప్పుచున్నది? మత్తయి 7:1-5ను బట్టి యితరులు ఏ చిన్న తప్పు చేసినా వేషధారులు దానిని వెంటనే వ్రేలెత్తి చూపిస్తారు, గాని వారు చేసే తప్పులు చాల ఘోరమైనవి. అందువలన యేసు, "వేషధారీ, మొదట నీ కంటిలో నున్న దూలమును తీసివేసికొనుము, అప్పుడు నీ సహోదరుని కంటిలో నున్న నలుసును తీసివేయుటకు నీకు తేటగా కనబడునని" చెప్పెను (మత్తయి 7:5). వేషధారులు తమ జీవితంలో యున్న ఘోర తప్పిదములను నిర్లక్ష్యము చేసి తమ పొరుగువారి జీవితంలోని సూక్ష్మ తప్పిదములను ఎత్తి చూపిస్తారు. నిజానికి ఇతరుల పాపములను గూర్చి చెప్పువారు, తమ పాపములను గూర్చి ప్రజలను దారి మళ్లించుటకు ప్రయత్నించుదురని నేను గమనించాను!

శాస్త్రులు పరిసయ్యులు ప్రజలు దేవుని రాజ్యములోనికి వచ్చువారిని అడ్డుకొనుచున్నం దున యేసువారిని వేషధారులని పిలిచెను. వారు పరలోక రాజ్యములో ప్రవేశింపరు, ప్రవేశించువారిని ప్రవేశింపనియ్యరు (మత్తయి 23:14). సంఘమునకు వెలుపల, లోపల యున్న వేషధారణను బట్టి అనేకులు దేవుని రాజ్యద్వారము నుండి మరలి పోయారు. ఎంత విచారము! క్రైస్తవేతరులు క్రైస్తవులను గూర్చి లేనిపోని మాటలాడుదురు. అట్టి మాటల వలన అనేకులు క్రీస్తుకు, ఆయన సంఘమునకు దూరమయ్యారు. వారు దేవుని రాజ్య

ములో లేరు, యితరులు కూడా దానిలో ప్రవేశింప నీయరు. అయితే సంఘసభ్యుల వేషధారణ కూడా అనేకులను అపవాది యొక్క నరక ద్వారమునకు నడిపించింది. సువార్తకు తగినట్టుగా నడుచుకొను క్రైస్తవులుంటే ఎంత బావుండును! (ఫిలిప్పీ 1:27). మన రక్షకుడగు దేవుని ఉపదేశ మును అలంకరించుకొను పరిశుద్ధులు మనకవుసరము (తీతు 2:9). నమ్మకమైన క్రైస్తవుల జీవి తాన్ని బట్టి క్రైస్తవేతరులు ఆకర్షింప బడుదురు (అపొ.కా. 2:47).

వేషధారులు కూడ వారిలో వారు అభి వృద్ధి జెందుదురు. తమలో ఒకని కలుపు కొనడానికి భూమిని సముద్రమును చుట్టి వచ్చు శాస్త్రులను పరిసయ్యులను యేసు ఖండించెను (మత్త 23:15). సాతానుడు సమయాన్ని మించి పనిచేయు చున్నట్లగు పడుచున్నాడు. వేషధారులు పెరిగిపోతు న్నారు. మొదటి శతాబ్దములోవలే క్రైస్తవులు విస్తరించుటలేదు. ఆదిమ సంఘము దిన దినము సంఖ్యలో విస్తరించెను (అపొ.కా. 16:5; 6:7).

వేషధారులు యేమి చేస్తారు? వారు కానిదాన్ని ఉన్నట్లు నటిస్తారు. "దేవుని ఎరుగుదుమని వారు చెప్పుకొందురు గాని, అసహ్యులును అవిధేయులును ప్రతి సత్కా ర్యము విషయము భ్రష్టులై యుండి తమ క్రియల వలన ఆయనను ఎరుగమన్న ట్టున్నారు" అని తీతు 1:16లో వ్రాయబడి యున్నది. అట్టివారు "పైకి భక్తిగల వారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించని వారునైయుందురు" (2 తిమో 3:5). వారు క్రీస్తును వెంబడించు చున్నామని తలం చుచు నిజానికి సాతానును వెంబడిం చుదురు. ఎంత విచారము! "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక - ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు?" అని యేసు ప్రభువు అడిగారు (లూకా 6:46).

రెండవదిగా, వేషధారణ లేకుండుట అత్యవసరమని గమనించుదాం. శాస్త్రులు పరిసయ్యులు చెప్పేవారే గాని చేసేవారు కాదు. మనం వారివలె యుండరాదు (మత్తయి 23:3). మనం పరలోక రాజ్యములో ప్రవేశించాలంటే మన నీతి శాస్త్రుల నీతికంటెను పరిసయ్యుల నీతి కంటెను అధికముగా యుండాలి (మత్తయి 5:20).

"మీ ప్రేమ నిష్కపటమైనదై యుండ వలెను" అని పౌలు చెప్పాడు (రోమా 12:9).

అంటే మన ప్రేమ వేషధారణ లేనిదై యుండాలి. మనం కపటమును, వేషధారణను మాని వేయాలని పేతురు చెప్పాడు (1 పేతురు 2:1). తిమోతి తన అవ్వలో, తల్లిలో యుండినట్టి నిష్కపటమైన విశ్వాసమును కలిగి యుండాలని పౌలు హెచ్చరించాడు (2 తిమో 1:5 1 తిమో 1:5). తోటి సహోదరుల యెడల మనం నిష్కపటమైన ప్రేమ కలిగియుండాలని పేతురు హెచ్చరించాడు (1 పేతురు 1:22). అంటే వేషధారణలేని ప్రేమ కలిగి యుండాలి.

## యేసు నీ యింటికి వచ్చిన యెడల

*ఒకటిరెండు దినాల మట్టుకు యేసు నీయింటికి వస్తే అనుకోకుండా ఆయన వస్తే నీ వేమి చేస్తావు? ఆయన రావడం చూచి, చేతులు చాచి ఆ పరలోక అతిథిని నీ గుమ్మము దగ్గరే ఎదుర్కొందువా? లేదా ఆయనను లోనికి ఆహ్వానించకముందు కొన్ని మేగజైనులు కాల్చివేసి బైబిలు ముందుంచి, కొన్ని సంగతులను అటు యిటు మార్చి ఆయనను లోపలికి రమ్మంటావా?*

*అంత ప్రఖ్యాత అతిథికి నీ యింటిలో మంచి గదినే యిస్తావని నాకు తెలుసు. ఆయనకు ప్రతిపూట రుచిగల వంటకాలనే వడ్డిస్తావు; మరియు ఆయన నీ యింటికి వచ్చినందుకు చాలా సంతోషం అని పదేపదే చెప్తావు ఆయనకు సేవ చేయడం మరింత గొప్ప భాగ్యం అని చెప్తావు. కాని నీ యింట్లో సంభాషణ ఎట్లుంటాది? భోజనం దగ్గర ప్రతిసారి కృతజ్ఞత చెల్లించడం కష్టమౌతాదా?*

*ఆయన నిరంతరం నీ యింట్లో వుండడానికి సంతోషిస్తావా? లేదా ఆయన చివరకు వెళ్లిపోయినప్పుడు అమ్మయ్య! అని వూపిరి పీల్చుకొంటావా? నిజానికి యేసు నీతో కాలం గడపడానికి వస్తే నీవేమి చేస్తావో తెలిసికొనడం మంచిదే.*

మూడవదిగా, యేసు యిచ్చిన వేషధారుల వర్ణను గమనించుదాం. వారు గ్రుడ్డివారైన మార్గదర్శకులని ఆయన చెప్పారు (మత్తయి 23:16). వారిని అవివేకులని ఆయన పిలిచారు (మత్త 23:17). వారు సున్నము కొట్టిన సమాధులని ఆయన పోల్చారు. అవి వెలుపల శృంగారముగా అగపడును గాని లోపల చచ్చిన వారి యెముకలతోను సమస్త కల్మషముతోను నిండియుంటాయి (మత్త 23:27). వారిని నరక కుమారులని కూడ ఆయన పిలిచారు (మత్త 23:15). సర్పములారా, సర్పసంతానమా యని ఆయన వారిని

పిలిచారు (మత్త 23:33). యేసు ఉపయోగించిన కఠిన పదజాలము వేషధారులను వర్ణించుట కాయన ఉపయోగించెను. వేషధారులను గూర్చి, నటించేవారిని గూర్చి, నకిలీలను గూర్చిన ఆయన మనస్సు మనకు విదితమే.

నాల్గవదిగా, వేషధారుల నిరీక్షణను గమనించుదాం. "భక్తిహీనుని ఆశ నిరర్థక మగునని" యోబు 8:13 చెప్పుచున్నది. భక్తిహీనునికి, వేషధారునికి నిరీక్షణేలేదని మనపాఠ్య భాగవచనం చెప్పుచున్నది. ఏల యనగా దేవుడు వాని ఆత్మను కొట్టి వేయును (యోబు 27:8). వేషధారులు ఈ లోకంలో ఎంత సంపాదించుకొనినను అదంతయు వ్యర్థమే. "ఒకడు ఈ లోకము నంతయు సంపాదించుకొని తన ప్రాణ మును పోగొట్టుకొంటే అతనికేమి ప్రయోజ నము? ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగానేమి యియ్యగలడు?" అని యేసు అడిగెను (మత్తయి 16:26). వేషధారులు నరశిక్షను తప్పించుకొనలేరని యేసు చెప్పెను (మత్త 23:33).

చివరిగా, క్రైస్తవులు నమ్మకమైన యదార్థమైన నిజ క్రైస్తవ జీవితాన్ని జీవిం చాలి. ఇది ఎంతో అవుసరం. దేవుని పరిశు ద్ధుల జీవితంలో వేషధారణకు తావే లేదు.

- జాన్ స్టేసీ

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

**'సత్యవాణి'** టి.వి. కార్యక్రమములను ప్రతి మంగళ వారం ఉదయం 6:30 గం॥లకు **MAA** టి.వి. లోను మరియు ప్రతి శనివారం ఉదయం 6:30 గం॥లకు **తేజ ఛానల్** లోను చూడండి.

# రాజ్యము యొక్క విలువ

*(The value of the Kingdom)*

**మత్తయి 13:44-46**

## దేవుని రాజ్యమును కనుగొనువారు గొప్ప విలువైన ముత్యమును కనుగొందురు

యేసు చెప్పిన దిగువ ఉపమానములు సూక్ష్మమైనవే అయినను శక్తివంతమైనవి. "పరలోక రాజ్యము పొలములో దాచబడిన ధనమును పోలి యున్నది. ఒక మనుష్యుడు దాని కనుగొని దాచిపెట్టి అది దొరికిన సంతోషముతో వెళ్లి తనకు కలిగిన దంతయు అమ్మి ఆ పొలమును కొనును. మరియు పరలోక రాజ్యము మంచి ముత్యములను కొన వెదకుచున్న వర్తకుని పోలి యున్నది. అతడు అమూల్యమైన ముత్యమును కనుగొనిపోయి తనకు కలిగిన దంతయు అమ్మి దానిని కొనును" (మత్త 13:44-46).

## దాచబడిన ధనము మరియు అమూల్యమైన ముత్యము

మొదటి ఉపమానములో ఒక మనుష్యుడు పొలములో దాచబడిన ధనమును కనుగొన్నాడు. అతడు దానిని దాచిపెట్టి వెళ్లి తనకు కలిగిన దంతటితోను ఆ పొలమును కొన్నాడు. ఆ రీతిగా ఆ ధనాన్ని పొలాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. పూర్వకాలంలో ప్రజలు తమ ధనాన్ని పొలములో రహస్యంగా దాచుకొనేవారు. ఆ ధనాన్ని దాచిన వాడు చనిపోతే దాని ఆచూకీ ఎవరికీ తెలిసేదికాదు. ధనాన్ని భూమిలో పాతిపెట్టడం అనైతికం అని కొందరంటారు. గాని ఎడెర్షీమ్ అను గ్రంధకర్త "Life and Times of Jesus the Messiah" అను పుస్తకంలో ఈలాగు వ్రాసాడు : " అది యూదుల చట్ట ప్రకారమున్న చర్యయే. ఫలములు కొన్నవానికి ఆ ఫలములోపల యున్నదంతటిని అనుభవించుటకు హక్కున్నది".

రెండవ ఉపమానములో వర్తకుడొకడు అందమైన ముత్యముల కొరకు వెదకుచున్నాడు. అతడు అమూల్యమైన ముత్యమును కనుగొనినప్పుడు తనకున్న దంతటిని అమ్మి దానినికొన్నాడు. ధననిధిని

పొలములో కనుగొన్నావాడు బహుశ అనుకోకుండగనే దానిని కొనినను, ఈ వర్తకుడైతే తనకు కావలసిన విలువైన ముత్యముల కొరకు వెదకుచున్నాడు. సత్యం ఒక్కసారి అనుకోకుండగనే మనకు బయలు పడవచ్చు, లేదా దాన్ని వెదకి మనం కనుగొనవచ్చు. సమరయ స్త్రీ మొదటి సందర్భానికి ఉదాహరణగా యున్నది. ఐతియొపీయ ఘనుడు రెండవ దానికి ఉదాహరణగా యున్నాడు (యోహాను 4; అపొ.కా. 8). ఒకడు దాన్ని ఏలాగు కనుగొన్నాడో ముఖ్యం కాదు. కనుగొనిన తరువాత దాని శక్తిని గమనించి తనకున్న దంతయు వెచ్చించి దానిని సంపాదించుకోవాలి.

## రాజ్యము యొక్క శ్రేష్టమైన విలువను బట్టి మనందరం త్యాగం చేయాలి

ఈలోక ధనం అంతటి కంటే దేవుని రాజ్యము విలువైనది. దానిని కొనడానికి యేసు చెల్లించిన మూల్యాన్ని బట్టి దాని విలువను కనుగొనవచ్చును. ఆయన తన స్వంత రక్తంతో దాన్ని కొన్నారు (అపొ.కా. 20:28). ఈ లోకధనం అంతటి కంటే ఒకని ఆత్మ ఎంత విలువైనదో అట్లే దేవుని రాజ్యం కుడాను (మత్తయి 16:24). రాజ్యము యొక్క అసలైన విలువను గ్రహించిన తరువాత ఒకడు దాన్ని కనుగొనుటయే తన జీవిత ముఖ్యోద్దేశముగ చేసుకోవాలి. "మొదట మీరు దేవుని రాజ్యమును ఆయన నీతిని వెదకుడి అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును" అన్ని యేసు చెప్పెను (మత్తయి 6:33). దేవుడొక్కడినే మన యజమానిగా ఎంచుకోవాలని ప్రభువు బోధించారు. ఏలయనగా యజమానులు ఎక్కువైతే నమ్మకత్వము కుంటుబడును (24 వచనం).

ఒకడు రాజ్యము యొక్క నిజమైన విలువను గ్రహించిన తరువాత, దాన్ని సంపాదించుకొనడానికి ఎనలేని తృష్ణగొని యుండును. నిజానికి తన జీవితంలో రాజ్యమును కలిగి యుండడానికి తనకున్న దంతటిని త్యాగం చేయును (మత్తయి 16:24-25). పౌలు తాను యూదులలో నిష్టగలవాడనని చెప్పుకొన్నాడు. అయినను క్రీస్తును సంపాదించు కొనుటకు అతడు అంతటిని నష్టముగా ఎంచుకొన్నాడు (ఫిలిప్పీ 3:7-8). రోమా లోని సహోదరులు ఉత్తమమును దేవునికి అనుకూలమునగు సజీవ యాగముగా తమ శరీరములను

సమర్పించుకొనాలని అతడు హెచ్చరించాడు. అట్టి సేవ యుక్తమైనది (రోమా 12:1-2).

## రాజ్య సంపాదనలో ఆనందము

దాచబడిన ధనమును కనుగొనిన వాడు గొప్పగా స్పందించాడు. "అది దొరికిన సంతోషముతో వెళ్లి తనకు కలిగిన దంతయు అమ్మి ఆ పొలమును అతడు కొన్నాడు". క్రీస్తు రాజ్య పౌరుడుగా యుండుటకు పొలు సమస్తాన్ని వదులు కొన్నాడని చూచాం. అయినను ఫిలిప్పీయులకు వ్రాస్తు, "ఎల్లప్పుడు ప్రభువు నందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి" యని అతడు చెప్పగలిగాడు (ఫిలిప్పీ 4:4). కలిమియందును లేమి యందును కూడ సంతృప్తి కలిగి యుండుటకు అతడు నేర్చుకొన్నాడు. లేమిలో యున్నంత మాత్రాన పొలు యొక్క ఆనందానికి కొరత లేదు. ఏలయనగా తనను బలపరచు క్రీస్తు నందే అతడు సమస్త చేయగలిగెను (ఫిలిప్పీ 4:10-13). ఒకడు అమూల్యమైన దానిని కనుగొన్నప్పుడు, మిగతావన్నీ వదలి పెట్టగలడు.

ముత్యముల వర్తకుని ఉపమానంలో అతని సంతోష స్థావరాన్ని గూర్చి మనం ఆలోచించవచ్చును. అతడు ఏకాగ్రత గలవాడు. అతనికి కావలసిన విలువైన ముత్యం దొరికినప్పుడు దాని కొరకు అన్నీ వదలిపెట్టాడు (ఫిలిప్పీ 3:13-14 చూడుము). మనం కూడ గొప్ప సంతోషాన్ని పొందాలంటే, మనం పరలోకానందంపై ఏకాగ్రత కలిగి యుండాలి. ఐతియోపీయుని వలె దేవునికి లోబడుటకు దేనిని అభ్యంతరముగా ఎంచకూడదు. దేవునికి లోబడుట సంపూర్తికాగానే అందరు సంతోషముతో తమత్రోవను వెళ్లవచ్చును!

✍ - గేరి సి. హాంప్టన్

సత్యవాణి' అను మా రేడియో కార్యక్రమమును ప్రతి ఆది, సోమ, మంగళ, గురు వారాల్లో మధ్యాహ్నం 2:00 గం॥లకు రేడియో శ్రీలంక ద్వారా వినండి !

# మార్పులేని సంఘము

*(The Changeless Church)*

సంఘములో వున్న అనేకులు మార్పు కావాలంటున్నారు. సంఘము నేటి కాలానికి అనుగుణంగా మార్పు జెందకపోతే అది మన్నుట కష్టమని వారంటారు. ఇట్టి భావం స్వయం విరుద్ధం. ఏలయనగా మానవుడు ఎల్లప్పుడు స్థిరమైన దానిని, మార్పులేని దానిని కోరుకొంటాడు. మార్పు లేని సంగతులలో క్రీస్తు సంఘమొకటి. దాని ప్రాముఖ్య లక్షణాలలో సంఘము మార్పు లేనిది. అది పనిచేయుట కుపకరించు పద్ధతులు మారవచ్చును గాని దాని దైవిక నిర్మాణములో ఎవ్విధమైన మార్పు కనబడదు.

## దైవావేశ అంశము

సంఘము మార్పులేనిదను అంశము దైవావేశముతో ముడిపడి యున్నది. అది ఎన్నటికిని నాశనము గాక యుగయుగములు నిలుచునని దానియేలు ప్రవచించాడు (దానియేలు 2:44). హెబ్రీ పత్రిక లేఖకుడు ఆ పత్రికను చదువు వారొక స్థిరమైన, నిశ్చలమైన రాజ్యమును పొంది యున్నారని తెలియజేసెను (హెబ్రీ 12:28). యిది క్రొత్తనిబంధన సంఘ నిర్మాణికుడైన మన ప్రభువు బోధకు సమన్వయించి యున్నది (మత్తయి 16:18).

## సంఘము ఏల మార్పు లేనిది?

1. అది దేవుని నిత్య సంకల్పము యొక్క నెరవేర్పు : ఎఫెసులో యున్న క్రీస్తు సంఘమునకు పౌలు ఇట్లు వ్రాసెను : "దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్యసంకల్పము చొప్పున, పరలోకములో ప్రధానులకును, అధికారులకును సంఘము ద్వారా తన యొక్క నానా విధమైన జ్ఞానము ఇప్పుడు తెలియజేయ బడవలెనని" ఉద్దేశించెను (ఎఫెసీ 3:8-11). సంఘమును గూర్చి దేవుడు ఏదో ఒక దానికి బదులుగా తలంచలేదు. రాజ్యమునకు బదులుగా ఆయన సంఘమును స్థాపించ లేదు. నిజానికి రాజ్యము, సంఘము ఒక్కటే యని లేఖనములు బోధించు చున్నవి (మత్తయి 16:18, 19; కొలస్స 1:13). దేవుడు ఆది లోనే సంఘమును సంకల్పించెను. దేవుడు సంకల్పించిన దానికి మార్పు యేమీ అక్కరలేదు. ఆయన ప్రయోగాలు చేసి ఒక ముగింపునకు రాలేదు. ఆయన దేనినైనా ఆరంభించకముందు అదెట్లు పని చేయునో

ఎరుగును. సంఘ నిర్మాణికుడు దానిని పరిపూర్ణముగా నిర్మించెను గనుక అది మార్పు లేనిది.

**2. సంఘము యొక్క అవుసరతను కల్పించిన పాపము మార్పులేనిది :** పాపపు అభ్యాసము నుండి రక్షింపబడిన వారిచే సంఘము సమకూడి యున్నది (అపొ.కా. 2:47; 1 యోహాను 5:19). పాపి దేవుని యొద్దకు చేరే మార్గము సంఘమై యున్నది (ఎఫెసీ 2:16-18; 3:12). పాపం వున్నంత కాలము సంఘము యొక్క అవుసరత యుండును. పాపులు రక్షింపబడుటకు ఒక మార్గముగా సంఘము నిర్మించబడి యున్నది. ఆ అవుసరం ఇంకా అలాగే యున్నది. అందులో మార్పులేదు.

**3. దాని ఉనికిని సాధ్యపరచిన రక్తము మార్పులేనిది:** సంఘము క్రీస్తు యొక్క ప్రశస్త రక్తముచే కొనబడినది (అపొ.కా. 20:28; 1 పేతురు 1:18, 19). క్రీస్తు రక్తముచే కొనబడని సంఘముల ఆకారములో మార్పులు సంభవించును గాని ఆయన రక్తమువలె క్రీస్తు సంఘము కూడ మార్పులేనిది (హెబ్రీ 10:11,12,14).

**4. దాని శిరస్సైన క్రీస్తు మార్పులేనివాడు :** సంఘమైన ఆయన శరీరమునకు క్రీస్తు శిరస్సయి యున్నాడు (ఎఫెసీ 1:22, 23; కొలస్స 1:18). "యేసు క్రీస్తు నిన్న నేడు ఒక్కటే రీతిగా యున్నాడు; అవును యుగ యుగములకును ఒక్కటే రీతిగా యుండును" (హెబ్రీ 13:8). క్రీస్తు సంఘమునకు శిరస్సు ఎవరని? ఎవ్వరైనా అడిగితే, శతాబ్దముల తరబడి ఆ ప్రశ్నకున్న జవాబు ఒక్కటే - క్రీస్తు !! సంఘమునకున్న ఏకైక శిరస్సు క్రీస్తే. రెండు వేల సంవత్సరములకు పైగా ఆ శిరస్సులో మార్పులేదు. దేవునిచే నిర్మించబడిన సంఘమునకున్న శిరస్సు సజీవుడైన వాడు. ఆయన సమాధిలోనే యుండిపోక తిరిగి లేచి సజీవుడై యున్నవాడు. మిగతా మతాలకు క్రైస్తవ్యమునకు వున్న గొప్ప వ్యత్యాసము యిదే. మార్పులేని శిరస్సయిన క్రీస్తు సర్వాధికారము కలిగి యున్నాడు.

✍ - డబ్ల్యు. డగ్లస్ హారిస్

---

<u>గమనిక :</u> సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

*SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.*

# నీ బిడ్డ యోగ్యమైనవాడు

*(Your Child Deserves.....)*

“ప్రభువు యొక్క బోధలోను శిక్షలోను వారిని పెంచుడి” (ఎఫెసీ 6:4).

1. నీవు తరచు ప్రార్ధన చేయుచుండుట నీ బిడ్డ చూచుటకు యోగ్యమైన వాడు.
2. నీబిడ్డ నీతో బైబిలు క్లాసుకు, ఆరాధనకు క్రమముగా వెళ్లుటకు యోగ్యమైన వాడు.
3. దేవుని కొరకు నీవు త్యాగం చేయడం నీ బిడ్డ చూడదగినవాడు.
4. యితరులు క్రైస్తవులగుట యెట్లో నీవు చెబుతుంటే దాన్ని చూచుటకు నీ బిడ్డ యోగ్యమైన వాడు.
5. రోగులను, దుఃఖించు వారిని దర్శించుటకు నీతో కూడ నీ బిడ్డ వచ్చుటకు యోగ్యమైనవాడు.
6. నీ బిడ్డకు నీవు బైబిలు బోధించుటకు యోగ్యమైనవాడు.
7. నీవు సంఘాన్ని, సంఘనాయకులను హర్షించుటను నీ బిడ్డ వినదగినవాడు.
8. సత్యమునకు ఎల్లవేళలా లోబడునట్లు నీ బిడ్డను నీవు ప్రోత్సహించ దగినవాడు.
9. ఇచ్చుటలో నీవు ప్రభువుకు ప్రధమ స్థానాన్ని యిచ్చుటను నీ బిడ్డ గమనించ దగినవాడు.
10. క్రీస్తు నీలో నివసించుచున్నట్లు నీబిడ్డ గమనించుటకు యోగ్యమైనవాడు.

శ్రేష్టమైన వాటికి నీ బిడ్డ యోగ్యమైనవాడు !

# సత్యము స్వాతంత్ర్యము

(TRUTH AND FREEDOM)

"మీరు సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులునుగా చేయును" (యోహాను 8:32). పైన చెప్పబడిన మాటలు సర్వ సత్యములు. జీవితంలో అనేక విషయాల్లో స్వాతంత్ర్యానికి నిదర్శనములు.

రాజకీయముగా అది సత్యము. బాగా చదువుకొన్న, ఎరిగియున్న ప్రజలను బానిసలుగా చేయడం అసాధ్యం. నిరంకుశ శక్తులు వార్తా పత్రికలకు స్వేచ్ఛను నిరాకరిస్తారు. నిశితంగా పరీక్షిస్తారు. నిరంకుశ పాలకుల నిదర్శనం యిది.

అది ఆర్థిక విషయాల్లో సత్యం. తెలివి వుంటే స్వల్ప జీతాలిచ్చే ఉద్యోగాల నుండి స్వాతంత్ర్యము లభిస్తాది.

ఆత్మీయ విషయాల్లో యిది సత్యం. యేసు పై చెప్పిన మాటలను ఈ సందర్భంలోనే చెప్పారు : ఆయన మాటలు విన్నవారు మేమెనికి బానిసలు కామన్నారు. యేసు పాపము చేయు ప్రతి వాడును పాపముకు దాసుడని చెప్పారు. తాను చేసిన పాపానికి క్షమాపణ నొందని వాడు, పాపము చేస్తూనే యుండేవాడు, పాపానికి నిజంగా దాసుడు (యోహాను 8:34-36).

పైన జెప్పిన సందర్భములన్నియు సత్యము; అవి మానవునికి వర్తిస్తాయి. గాని యేసు చెప్పిన ఈ మాటలలోని అసలైన భావమును ఎవరు పూర్తిగా తెలిసికొన లేకపోయారు. ఈ వచనము షరతుతో కూడిన ఒక వాగ్దానమై యున్నది. ఒక షరతు, ఒక ప్రతిఫలం అందులో యున్నది.

షరతు : సత్యమును తెలిసికొనుడి. ప్రతిఫలం : స్వతంత్రులుగా యుండుడి. యిది అందరు అంగీకరించిన వాస్తవమే గాని అది అట్లులేదు. అంటే, ఈ వచనం షరతులతో కూడిన ఒక వాగ్దానం. ఒకే షరతు గాని మూడు ప్రతిఫలాలు. యేసు ఇట్లు చెప్పెను: "మీరు నా వాక్యంలో నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును".

షరతు : యేసు మాటల యందు నిలిచి యుండాలి.

ప్రతిఫలం : 1. ఆయన శిష్యులగుట

2. సత్యమును తెలిసికొనుట

3. స్వతంత్రులగుట

సత్యమును తెలిసికొనుటలో కలిగే లాభాన్ని గూర్చి గాక, సత్యమును తెలిసికొనుట యెట్లో యేసు బోధించారు. అది ఎక్కడ లభించునో బోధించారు.

తండ్రియైన దేవునికి ప్రార్థించుచు, "సత్యమునందు వారిని ప్రతిష్ఠచేయుము; నీ వాక్యమే సత్యమని" ఆయన పలికారు (యోహాను 17:17). సువార్త సత్యవాక్యమై యున్నది (ఎఫెసీ 1:13). మనం సత్యమునకు లోబడితే పరిశుద్ధుల మవుతాము (1 పేతురు 1:22).

ఆయన వాక్యమందు నిలిచియుండుము. నీవాయన శిష్యుడవ గుదువు. నీవు సత్యాన్ని తెలిసికొంటావు, స్వతంత్రుడవగుతావు.

- సిసిల్ మే Jr.

* * * *

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:
**SATYA VAKKU**
**P.O. Box 80,**
**Kakinada - 533 001**

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.